


పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

స్వేచ్ఛాయుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ నిర్వహించేలా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ చర్యలు చేపట్టారు. - 8లో



నేడు రంగుల హోలీ

ఫాల్గుణ మాస పౌర్ణమి. లేలేత చిగుళ్లు, విరబూసిన పూరెమ్మలు, చెట్లు వసంత రాగం ఆలపిస్తున్న తరుణంలో ఆనందోత్సాహలతో జరుపుకునే పండగ హోలీ. - 8లో



న్యూస్‌రీల్

రామతీర్థంలో వైభవంగా పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో కామాక్షి మాత

నెల్లిమర్ల రూరల్: పౌర్ణమిని పురస్కరించుకొని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ క్షేత్ర పాలకులైన ఉమాసదాశివాలయంలో అర్చకులు మల్లిఖార్జునశర్మ ఆధ్వర్యంలో శ్రీ కామాక్షి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి కుంకుమ పూజలను వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో మహాపూర్ణాహుతిని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెరకు క్రషింగ్ పూర్తి



క్రషింగ్ పూర్తి చేస్తున్న సిబ్బంది

రేగిడి : సంకిలి వద్ద ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఆదివారం చెరకు క్రషింగ్ పూర్తయిదని కర్మాగార అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యం కాగా, 3,92,750 మెట్రిక్ టన్నుల చెరకును క్రషింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. గతేడాది 10.02 రికవరీ రాగా, ఈ ఏడాది 9.09 రికవరీ వచ్చినట్లు వెల్లడించారు. గతేడాది అక్టోబర్ 31న క్రషింగ్‌ను ప్రారంభించామని, రైతులు, సిబ్బంది సహకారంతో క్రషింగ్ విజయవంతంగా ముగిసిందని వివరించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు లచ్చయ్యపేట షుగర్స్ పరిధిలోని 9709 మెట్రిక్ టన్నులు, భీమసింగి పరిధిలోని 6,632 మెట్రిక్ టన్నుల చెరకును క్రషింగ్ చేసి రైతులకు అండగా నిలిచామని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చెరకు క్రషింగ్‌ను పెంచడంతో పాటు చెరకు సాగును 18,000 ఎకరాలకు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఆయన వెంట కేన్ డీజీఎం రాజేందర్, హెచ్ఆర్‌డీ వి.మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

మరో వలంటీర్ తొలగింపు

విజయనగరం అర్బన్: సోషల్ మీడియాలో రాజకీయ పార్టీ నాయకునికి అనుకూలంగా పోస్టులు పెట్టిన ఎల్.కోట మండలానికి చెందిన ఒక గ్రామ వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి ఆదివారం తెలిపారు. ఎల్.కోట మండలం ఖాసాపేట గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్ బొబ్బిలి శివ సోషల్ మీడియా వేదికల్లో పోస్టు నమోదు చేసినట్టు ఫిర్యాదు అందిన మీదట విచారణ చేయగా ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఆ వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్టు పేర్కొన్నారు.

శిష్టకరణ వధూవరుల పుస్తకావిష్కరణ



శిష్టకరణ సంఘం వధూవరుల పుస్తకావిష్కరణ చేస్తున్న ఈశ్వరరావు తదితరులు

విజయనగరం టౌన్: శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బృందావనం అపార్ట్‌మెంట్‌లో శిష్టకరణ వధూవరుల పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కార్తీక మాసం వన సమారాధనలో సేకరించిన వధువు, వరుడు వివరాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల రిపబ్లిక్ డే పురస్కరించుకుని ప్రభుత్వ విధి నిర్వహణలో అవార్డులు పొందిన వారికి గౌరవ సత్కారం చేశారు. కార్యక్రమంలో కుప్పిలి చిత్ర, ఆరికతోట సురేష్, కిశోర్, పట్నాయకుని సంధ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగ సురేష్, వివి.వెంకటేష్, పట్టణ శాఖ అధ్యక్షుడు కెఎమ్.సంజీవరావు, కార్యదర్శి ఆర్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో భరోసా

- ఏటా వేలాది మందికి చికిత్స
- ఐదేళ్లలో 2.56 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలు
- ఇందుకు ప్రభుత్వం వెచ్చించిన నిధులు రూ.537.07 కోట్లు
- 3,257 వ్యాధులకు ఆరోగ్యశ్రీ సేవలు

ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలుడి పేరు శివ. సాలూరు గ్రామం. శివకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కొద్ది రోజుల కిందట ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. స్కానింగ్ చేయగా అపెండిసైటిస్‌గా తేలింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్స చేశారు. శివ వైద్యానికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.23,400 ఖర్చు చేశారు.





ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎం.ఎర్రయ్య. ఈయనది గజపతినగరం. దగ్గు, ఆయాసం రావడంతో కొద్ది రోజుల కిందట ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు నిమోనియాగా నిర్ధారించి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. ఈయన వైద్యానికి రూ.30,700 ఆరోగ్యశ్రీ ద్వారా వెచ్చించారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు సీహెచ్ సింహాచలం. ఈయనది పార్వతీపురం. పొత్తులో నొప్పి రావడంతో కొద్ది రోజుల కిందట ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చాడు. ఈయనకు స్కానింగ్ చేయించిన వైద్యులు హెర్నియాగా గుర్తించి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్స చేశారు. పూర్తిగా కోలుకోవడంతో అతన్ని డిశ్చార్జ్ చేశారు. ఈయన వైద్యానికి రూ.25,657 వెచ్చించారు.

సంవత్సరం	ఆరోగ్యశ్రీ రోగుల సంఖ్య	వెచ్చించిన నిధులు
2019–20	31,357	రూ.73.06 కోట్లు
2020–21	35,776	రూ.84.69 కోట్లు
2021–22	62,508	రూ.123.59 కోట్లు
2022–23	61,053	రూ.123.61 కోట్లు
2023–24	65,374	రూ.126.75 కోట్లు

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మజ్జి అప్పారావు. ఈయనది జామి మండలం భీమసింగి గ్రామం. ఈయనకు బ్రాంకైటీస్ సోకడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స అందించారు. ఈయన వైద్యానికి రూ.30,700 వెచ్చించారు.



విజయనగరం ఫోర్ట్:

రోగులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పునర్జన్మ ప్రసాదిస్తోంది. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు కార్పొరేట్ ఆస్పత్రులు సైతం వైద్యం అందిస్తున్నాయి. ఈ క్రమంలో ఆరోగ్యశ్రీ పథకం లేకుంటే తమ పరిస్థితి ఏంటని పేద, మధ్య తరగతి ప్రజలు తలుచుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ఉండడం వల్లే తమ ఆరోగ్యానికి కొండంత భరోసాగా ఉందని ప్రజలు భావిస్తున్నారు. వేలాది మంది ఏటా ఆరోగ్యశ్రీ లబ్ధి పొందుతున్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో రెండు లక్షలకు పైగా ప్రజలు ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకున్నారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.537 కోట్లు వరకు వెచ్చించింది.



రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు

వైద్యం ఖర్చు రూ.1000 దాటితే చాలు ఆరోగ్యశ్రీ వర్తిస్తుండంతో అధిక శాతం మంది ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. గతంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తించేది కాదు. ప్రస్తుతం వాటికి కూడా ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తున్నారు. అంతేకాకుండా కేన్సర్, గుండె జబ్బులకు ఎన్ని లక్షలు ఖర్చు అయినా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా చేయిస్తోంది. గతంలో కేన్సర్, గుండె జబ్బులు వంటి పెద్ద జబ్బులకు చికిత్స కోసం పేద, మధ్యతరగతి వర్గాల వారు అప్పులు చేయడం, ఉన్న ఆస్తులు తాకట్టు పెట్టుకుని చికిత్స చేయించుకునేవారు.

3,257 వ్యాధులకు చికిత్స

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ప్రస్తుతం 3257 వ్యాధులకు చికిత్స అందిస్తుంది. 2019 వరకు కేవలం 1000 వ్యాధులకు మాత్రమే చికిత్స అందేది. తర్వాత 2,446 వ్యాధులకు పెంచారు. వాటికి అదనంగా మరో 811 వ్యాధులను చేర్చారు. ప్రస్తుతం 3257 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం కుటుంబాలు 7 లక్షలు ఉన్నాయి. జిల్లాలో అధికశాతం మంది పేద, మధ్య తరగతి ప్రజలే ఆరోగ్యశ్రీ కార్డు ఉండడం వల్ల ఉచితంగా సేవలు పొందుతున్నారు.

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు

జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు 28 ఉన్నాయి. గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం ప్రాంతీయ ఆస్పత్రి, ఎస్.కోట ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీ బాడంగి, సీహెచ్‌సీ భోగాపురం, సీహెచ్‌సీ బొబ్బిలి, సీహెచ్‌సీ చీపురుపల్లి, సీహెచ్‌సీ నెల్లిమర్ల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషాస్పత్రి, అభినవ ఆస్పత్రి (ఎస్.కోట), కొలపర్తి ఆస్పత్రి (ఎస్.కోట), సాయి పీవీఆర్ ఆస్పత్రి (విజయనగరం), శ్రీ సాయి సూపర్ ఆస్పత్రి, వెంకట రామ ఆస్పత్రి, ఆంధ్ర ఆస్పత్రి, మారుతీ ఆస్పత్రి, పీజీ స్టార్ ఆస్పత్రి, స్వామి ఐ ఆస్పత్రి, మిమ్స్, నెఫ్రోప్లస్, ముువ్వ గోపాల ఆస్పత్రి, గాయిత్రి, పుష్పగిరి ఆస్పత్రి, తిరుమల మెడికవర్ ఆస్పత్రి, శ్రీనివాస నర్సింగ్ హోమ్, జీఎంఆర్ కేర్ ఆస్పత్రి, అమృత ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయి.

2,50,068 మందికి చికిత్స

జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 2019 నుంచి ఇప్పటి వరకు 2,50,068 మందికి చికిత్స అందించారు. ఇందుకోసం రూ.531.07 కోట్లు వెచ్చించారు. ఏటా 40 వేల నుంచి 60 వేల మంది వరకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్నారు.

క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలి

- ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ట్రైనీ సహాయ కలెక్టర్ త్రివినాగ్

విజయనగరం ఫోర్ట్: క్షయ లేని సమాజం అందరి లక్ష్యం కావాలని ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధిపై ఉన్న అపోహలు తొలిగించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఇది పూర్తిగా నయం చేయతగిన వ్యాధి అని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వ్యాధి నిర్ధారణ మరింత సులువుగా మారిందని చెప్పారు. దీనిని వినియోగించుకుని ప్రతి కేసును గుర్తించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించగలమన్నారు. ప్రతి క్షయ వ్యాధిగ్రస్తుడికి నెలకు రూ.500 సహాయంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించి క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, డీఎల్ఓ డాక్టర్ కె.రాణి పాల్గొన్నారు.

అభిమానులు ఆదేశిస్తే.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా...



ఎస్.కోటలో అభిమానులతో కలిసి ర్యాలీ చేస్తున్న గొంప కృష్ణ

- గొంప బల నిరూపణ ర్యాలీ
- కష్టంతో ఎదిగా.. పార్టీ కోసం పని చేశా..
- ప్రజలు మెచ్చి ఇచ్చిన పదవి కావాలి

శృంగవరపుకోట: నా రాజకీయం సేవ కోసం.. నా ప్రాంత అభివృద్ధి కోసమే తప్ప పదవుల కోసం కాదంటూ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి భంగపడ్డ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ చెప్పారు. తన కార్యాలయ ప్రాంగణంలో ఐదు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అంతకు ముందు వేల సంఖ్యలో వచ్చిన అభిమాన జనంతో కలిసి దేవీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజకీయాలు దండుకోడానికి కాదని, ప్రజలకు సేవ చేయడానికేనని అన్నారు. కొందరిలా తాను రియల్ వ్యాపారుల వద్ద దండుకోలేదని, పెండింగ్ బిల్లుల కోసం లాయర్ల పేరు చెప్పి వసూళ్లు చేయలేదని, తిరుపతి దర్శనం టోకెన్లు అమ్ముకోలేదని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసే అలవాటు తనకు లేదన్నారు. పార్టీ ఇచ్చే పదవి తనకు అవసరం లేదని, ప్రజలు మెచ్చి ఇచ్చిన పదవి కావాలన్నారు. రెండేళ్లుగా ప్రజల మధ్యే ఉన్నానని.. అలాగే రాబోయే ఐదేళ్లు ఇక్కడే ప్రజల మధ్య ఉంటానంటూ చెప్పారు. తాను, జనం కలసి మనం అనేలా ఉండడమే తన నైజమన్నారు. చంద్రబాబు పిలిస్తేనే వచ్చి కనుమరుగైన తెలుగుదేశం పార్టీ కోసం రెండేళ్లు కష్టపడి పని చేశానన్నారు. తాను ఆశించకున్నా పార్టీ పెద్దలు ఎస్.కోటలో పోటీ చేయాలని, అమెరికా వెళ్లొద్దని ఆపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరు ఖరారైందని చెప్పిన తెలుగుదేశం అగ్రనేతలు తెల్లారేసరికి పేరు మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన అభిమానుల కోరిక మేరకు భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయాలని పార్టీ కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారని, వారి కోసం పోటీకి సిద్ధం అవుతున్నానంటూ తెలిపారు.

గవరమ్మపేటలో గజరాజుల గుంపు



భామిని: తాలాడ వైపు నడుస్తున్న గజరాజుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, వెంకటరాజపురం మధ్యనున్న పంట పొలాల్లో గజరాజుల గుంపు ఉంది. ఆదివారం మధ్యాహ్నం జొన్న పంటలో ఉన్న ఏనుగులు సాయంత్రానికి అరటి, వరి చేలలో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పంట చేలలోకి గజరాజులు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తాలాడ వైపు...

భామిని: మండలంలోని తాలాడ వైపు నాలుగు ఏనుగుల గుంపు పయనించింది. ఆదివారం ఘనసర సమీపంలో తోటల నుంచి తాలాడ ఐలమ్మ తోటలకు తరలివెళ్లాయి. ఫారెస్ట్ బీట్ అధికారి లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఎలిఫెంట్ ట్రాకర్స్ ఏనుగుల గుంపు ప్రయాణాన్ని గ్రామస్తులకు తెలిపారు. తాలాడలో గతంలో తిష్ఠ వేసిన ఏనుగుల గుంపు మళ్లీ వేసవి సమయంలో చేరుకొనడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్షణక్షణం నిఘా : ఎస్పీ



కూనేరు చెక్ పోస్టులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ సునీల్ షొరోన్

కొమరాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా – ఒడిశా సరిహద్దు గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ తదితర సిబ్బంది క్షణక్షణం పక్కా నిఘాతో పర్యవేక్షణ చేయాలని పార్వతీపురం ఎస్పీ సునీల్ షొరోన్ సూచించారు. మండలంలోని కూనేరు చెక్‌పోస్టు, రామభద్రపురం, కొమరాడ ఇసుక రీచ్‌లను ఆయన ఆదివారం పరిశీలించారు. కూనేరు చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు నేపథ్యంలో సమావేశాలు, సభలు, ర్యాలీలు, ప్రచారాలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల దృష్ట్యా చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. మద్యం, సారా అక్రమ తరలింపుపై నిరంతర తనిఖీలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఐ నీలకంఠం ఉన్నారు.

పోలమాంబ ఆలయంలో చండీ హోమం రేపు



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఈ నెల 26న చండీహోమం నిర్వహించనున్నట్టు ఈవో వి.వి.సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. శంబర పోలమాంబ అమ్మవారి 10వ జాతరను పురష్కరించుకొని మంగళవారం ఉదయం 9 గంటలకు వేద పండితులు కె.శ్రావణ్ కుమార్ చండీహోమం కార్యక్రమం జరపనున్నట్టు ఈవో తెలిపారు. మహా అన్నదాన కార్యక్రమం జరుపుతున్నట్లు తెలిపారు. పాల్గొనాలని ఈవో కోరారు.

నేటి నుంచి డోలాయాత్ర



బొబ్బిలి: వేణుగోపాలస్వామి

సంతకవిటి: మండలంలోని గుల్లసీతారాంపురం గ్రామంలో ఉన్న సీతారామస్వామి ఆలయంలో సోమవారం నుంచి డోలాయాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు భోగాపురపు ప్రసాదరావు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ యాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శుద్ధ పూర్ణిమతో కూడిన ఉత్తర ఫల్గుణి నక్షత్రమందు అనగా సోమవారం ఉదయం 6 గంటల 30 నిమిషాలకు ఆలయ సన్నిధి నుంచి స్వామి వారి విగ్రహాలను ఊరేగింపుగా మాడవీధుల గుండా ఉత్తర ముఖ మండపానికి తీసుకువస్తామన్నారు.

బొబ్బిలి: పట్టణంలోని పూల్‌భాగ్‌లోలో డోలా యాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. డోలా మండపంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి తీసుకువచ్చిన వేణుగోపాలస్వామి ప్రతిమలను భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జన నీరాజనం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి శ్రీకారం చుట్టిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు జనం నీరాజనం పడుతున్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత లబ్ధి పొందిన ప్రజలు ఆ పార్టీ అభ్యర్థులకు జేజేలు పలుకుతున్నారు. తమకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వారే చెబుతూ వచ్చే ఎన్నికల్లో కూడా అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జగనన్న సాగిస్తున్న పాలనకు తమ వంతు మద్దతు ఉంటుందని తేల్చి చెబుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరంలోని కాపువీధిలో ప్రచారానికి వెళ్లిన కోలగట్ల వీరభద్రస్వామికి హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



రాజాం మండలం బొద్దవలసలో ఇంటింట ప్రచారంలో భాగంగా వృద్ధుల ఆశీర్వాదం కోరుతున్న డాక్టర్ తలే రాజేష్



ఎస్.కోట మండలం వేచలపూడి గ్రామంలో కడుబండి శ్రీనివాసరావుకు హారతులిస్తున్న మహిళలు

క్లుప్తంగా

బెల్లం ఊటలు ధ్వంసం



బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీస్ సిబ్బంది

గుర్ల: మండలంలోని దేవునికణపాక సమీపంలో సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటలను ఎస్సై భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆదివారం ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన బెల్లం ఊట సుమారు 1500 లీటర్లు ఉంటుందని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారీపై సమాచారం ఉంటే ఇవ్వాలని స్థానికులను కోరారు.

కోడి పందాల రాయుళ్ల అరెస్టు



కోడిపందాల రాయుళ్లతో ఎస్సై రాజేష్, సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురంలో వల్లంపూడి పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఐదుగురు కోడిపందాల రాయుళ్లు పట్టుబడడంతో అదుపులోకి తీసుకున్నట్లు వల్లంపూడి ఎస్సై రాజేష్ తెలిపారు. గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ తీర్థమహోత్సవం సందర్భంగా కోడి పందాలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను, మూడు కోడిపుంజులను, ఎనిమిది వందల రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

టీడీపీ అభ్యర్థికి దొరకని మద్దతు

- మండలస్థాయి సమావేశానికి పార్టీ నాయకుల డుమ్మా



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ అభ్యర్థి శ్రీనివాస్

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రతిపక్ష టీడీపీకి తలనొప్పులు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి.బొండపల్లి మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం మండల సముదాయం వద్ద టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడుతో పాటు, పార్టీ రాష్ట్ర నాయకుడు కరణం శివరామకృష్ణకు చెందిన రెండు వర్గాల ముఖ్య నాయకులు హాజరు కాలేదు. పార్టీకి మండలంలో పెద్ద దిక్కుగా ఉన్న ముఖ్య నాయకులు ఎవరూ కార్యక్రమానికి హాజరు కాలేదు. మాజీ జెడ్పీటీసీ బండారు బాలాజీతో పాటు పార్టీ మండల అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న కోరాడ కృష్ణ, మరో కీలక నేత ఏఎంసీ మాజీ చైర్మన్ బి.చంటిరాజుతో పాటు, నియోజకవర్గ తొలి టీడీపీ ఎమ్మెల్యే జేఎస్ఎన్.రాజుకు చెందిన కుటుంబసభ్యులు, వారసులు కూడా సమావేశానికి హాజరు కాలేదు.అయితే మండలవ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వాహనాల్లో పెద్ద ఎత్తున ప్రజలను తరలించే ఏర్పాట్లు నాయకులు చేశారు. అక్కడ భోజనాలు కూడా ఏర్పాటు చేయడంతో గందరగోళం ఏర్పడింది. ఒక వైపు ముఖ్య నాయకులు ప్రసంగాలు జరుగుతుండగానే భోజనాలు కౌంటర్ల వద్ద బారులు తీరారు. భోజనాల కోసం పెద్ద సంఖ్యలో రావడంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఇక మండలంలోని టీడీపీ ప్రధాన నాయకులంతా ఈనెల 27 వతేదీన బుధవారం సమావేశం నిర్వహించాలని అప్పుడు అందరం వస్తామని చెప్పినప్పటికీ అభ్యర్థి శ్రీనివాస్ ఆదివారం సమావేశం నిర్వహించారనే ప్రచారం జరుగుతోంది.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹ 224

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

- 80 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- 1,031 పోలింగ్ కేంద్రాలు
- 7,75,598 మంది ఓటర్లు
- శాంతిభద్రతలపై పటిష్ట చర్యలు
- అందుబాటులో కంట్రోల్ రూమ్
- 10 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల ఏర్పాటు



ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సమావేశంలో కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురంటౌన్: స్వేచ్ఛాయుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ నిర్వహించేలా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు జిల్లాలో ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపట్టారు. అభ్యర్థి నామినేషన్ వేసిన నాటి నుంచి వారి ఖాతాల్లో ఖర్చు జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.90 లక్షల వరకు మాత్రమే ఖర్చు చేయాలన్నది నిబంధన. వాట్సాప్ తరహాలో ''సీ విజిల్'' యాప్ ద్వారా ఎవరైనా సమస్యను తెలియజేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పటిష్టమైన నిఘా పెట్టారు. బైండోవర్ కేసులు నమోదు చేసి, సరిహద్దు ఒడిశా రాష్ట్ర చెక్ పోస్ట్‌లతోపాటు జిల్లాలోని చెక్ పోస్ట్‌లను మరింత పటిష్టం చేసేలా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చర్యలు చేపట్టారు. జిల్లాలో మొత్తం 1,031 పోలింగ్ కేంద్రాల్లో పని చేయడానికి సిబ్బందిని ఏర్పాటు చేశారు.

మార్చి 16 నాటికి జిల్లాలో ఓటర్ల వివరాలు

జిల్లాలో ఈ నెల 16వ తేదీ నాటికి 7,75,598 మంది ఓటర్లు నమోదయ్యారని కలెక్టర్ నిషాంత్‌కుమార్ వెల్లడించారు. అందులో పురుషులు 3,78,764 మంది, స్త్రీలు 3,96,766 మంది, ట్రాన్స్ జెండర్లు 68 మంది ఉన్నట్లు చెప్పారు. అత్యధికంగా సాలూరు (ఎస్టీ) నియోజకవర్గంలో 2,01,441 మంది, అత్యల్పంగా పార్వతీపురం (ఎస్టీ) 1,87,854 మంది, పాలకొండ (ఎస్టీ) 1,93,667 మంది, కురుపాం (ఎస్టీ) నియోజకవర్గంలో 1,92,636 ఉన్నట్లు గతంలో ఆయన వివరించారు.

సిద్ధంగా పోలీస్ యంత్రాంగం

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉంది. సుమారు 3800 మంది సిబ్బంది అవసరం కాగా ఇప్పటి వరకు 800 మంది అందుబాటులో ఉన్నారు. జిల్లాకు 3 కంపెనీల కేంద్ర బలగాలు చేరుకున్నాయి. మరో 17 కంపెనీల బలగాల అవసరం ఉండడంతో జిల్లాకు తీసుకువచ్చే చర్యలు చేపట్టారు. జిల్లాలో 80 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 80 పోలింగ్ లోకేషన్ల పరిధిలోని మండలాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. గతంలో ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని బైండోవర్ చేసి, వెపన్స్ స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా 10 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

జిల్లాలో నలుగురు ఎన్నికల అధికారులు

జిల్లా పరిధిలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి నలుగురు ఆర్వోలను నియమించారు. పార్వతీపురం ఎన్నికల అధికారిగా ఆర్డీఓ హేమలత, సాలూరుకు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, పాలకొండ సాలూరు ఎన్నికల అధికారిగా సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి, కురుపాం ఎన్నికల అధికారిగా ఆర్డీఓ వీవీ రమణలు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు.



కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

అందుబాటులో కంట్రోల్ రూమ్

సాధారణ ఎన్నికల దృష్ట్యా కలెక్టర్ కార్యాలయంలోను, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలోను కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో 08963-796126, 293046, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కార్యాలయం 8977519101 నంబర్లను అందుబాటులో ఉంచారు.

సాగు నీటి కాలువ కప్పేసి రోడ్డు

- టీడీపీ నేత బరితెగింపు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు



సిరిపురం రెవెన్యూ పరిధిలో సాగునీటి కాలువ కప్పేసి వేసిన రోడ్డు

గంట్యాడ: గతంలోఅధికార మదంతో ఓ టీడీపీనేత రెచ్చిపోయాడు. అధికారం ఉంది కదాని ఏకంగా పోరంబోకు వాగు (సాగునీటి కాలువ)ను కప్పేసి తన సొంత పొలానికి వెళ్లడానికి రోడ్డు వేసేశాడు. దీనిపై అప్పట్లో రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఆ నేత అధికార పార్టీకి చెందిన వాడు అధికారులు మిన్నకుండి పోయారు. టీడీపీ నేత అక్రమంగా రోడ్డు వేయడం వల్ల సాగునీటి కాలువ ద్వారా చెరువులోకి వెళ్లాల్సిన నీరు వెళ్లడం లేదు. టీడీపీ నేత బరితెగించి ప్రభుత్వ సాగునీటి కాలువలో రోడ్డు వేసినప్పటికీ అప్పట్లో రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సిరిపురం రెవెన్యూ పరిధిలో ఘటన

గంట్యాడ మండలంలోని సిరిపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 108-1 లో సాగునీటి కాలువ ఉంది. ఈ కాలువ గుండా కంసాల చెరువులోకి వర్షాలు పడినప్పుడు మెట్టభూముల నుంచి వచ్చే నీరు వెళ్లేది. 2015-16 మధ్య కాలంలో టీడీపీకి చెందిన కీలక నేత ఒకరు ఈ కాలువను కప్పేసి రోడ్డు వేశారు. అక్రమంగా రోడ్డు వేస్తున్నారని, అడ్డుకోవాలని అప్పట్లో రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే రోడ్డు వేసింది ప్రభుత్వ భూమి అయినప్పటికీ అధికారులు చర్య తీసుకోక పోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లా

సాగునీటి కాలువపై రోడ్డు వేసిన సమయంలో నేను లేను. పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాను.

శ్రీనివాస్, వీఆర్వో, సిరిపురం

ముగ్గురిపై కులదూషణ కేసు నమోదు

బలిజిపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ప్రభాకర్‌ను కొట్టి, కులదూ షణ చేసిన ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. పదవ తరగతి పరీక్షా కేంద్రం వద్ద కానిస్టేబుల్ ప్రభాకర్ శనివారం పరీక్ష ప్రారంభంలో అందరినీ బయటకు పంపించారు. అదే సమయంలో ఉన్నత పాఠశాలకు చెందిన సబ్జెక్టు ఉపాధ్యాయులు లోపల ఉండగా వారిని ఇన్విజిలేటర్లుగా భావించి మిగిలిన వారిని పంపించారు. దీనిపై బి.జగన్, ఎ.వెంకటరమణ, వి.శంకరరావులు కానిస్టేబుల్‌ను అడగ్గా వారిమధ్య వాగ్వాదం జరిగింది. అదేసమయంలో కానిస్టేబుల్‌ను వారు చెంపపై కొట్టి, కులదూషణ చేసినట్టు ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు. జగన్, వెంకటరమణలు కానిస్టేబుల్ ప్రభాకర్‌ను కర్రతో కొట్టి, భయభ్రాంతులకు గురిచేసినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. దీంతో పాటు పరీక్షా కేంద్రంలో ఉపాధ్యాయులు కొంతమంది పిల్లలకు స్లిప్పులు అందించి అవకతవకలకు పాల్పడుతున్నట్టు తల్లితండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. దీనిని లోపల ఉండే అధికారులు సరిదిద్దాల్సి ఉందన్నారు. వారి దృష్టిలో ఈ విషయం ఉంచడం జరిగిందని తెలిపారు.

మహిళను గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామానికి రైతు రామలక్ష్మిని అదే గ్రామానికి చెందిన రైతు సురేష్ గాయపర్చిన ఘటనకు సంబంధించి కేసు నమోదుచేశామని సీఐ డి.మోహనరావు ఆదివారం తెలిపారు. రామలక్ష్మి భర్త భుజంగరావు కళ్లం వద్ద ఉండగా పక్క స్థలానికి చెంది రమేష్ అక్కడికి వచ్చి భుజంగరావుతో గొడవ పడుతున్నాడు. ఆ సమయంలో రామలక్ష్మి అడ్డుపడడంతో ఆమె తలపై గజంముక్కతో సురేష్ కొట్టాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు. అలాగే మండల పరిధి గురవాం గ్రామానికి చెందిన రెడ్డి ప్రవల్లిక, తొత్తరి కల్యాణి కుటుంబీకుల మధ్య జరిగిన గొడవకు సంబంధించి పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు.

హిందీ పరీక్షా ఫలితాల వెల్లడి

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ మద్రాస్ నిర్వహించిన హిందీ పరీక్షల ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయని హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ వరకూ గల ఈ పరీక్షలు ఫిబ్రవరిలో జరిగాయని, ఫలితాల నిమిత్తం ఫోన్ నంబర్ 9949917365ను సంప్రదించాలని సూచించారు.

సులభంగా చేపల వేట



- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న మత్స్యకారులు
- జీపీఎస్, ఎకోసౌండ్ సిస్టం వినియోగం

పూసపాటిరేగ: సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న మత్స్యకారులు ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. భారీ వలలతో సాగర మథనం చేసినా చేపలు చిక్కక ఉసూరుమంటూ వెనుదిరిగే పరిస్థితుల నుంచి బయట పడుతున్నారు. సాంకేతికతతో సులభంగా చేపలను ఒడిసి పడుతున్నారు. కెమెరాలు, జీపీఎస్, ఎకో సౌండ్ సిస్టమ్ ఉపయోగిస్తూ సముద్ర గర్భంలోని మత్స్య సంపదను వెలికితీస్తున్నారు. విజయనగరం జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల పరిధిలో 27 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. తీరం వెంబడి 19 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వారిలో సుమారు 10 వేల మందికి చేపల వేటే జీవనాధారం. రెండు మండలాల పరిధిలో 150 సంప్రదాయ బోట్లు, 450 వరకు ఇంజిన్ బోట్ల సహాయంతో మత్స్యకారులు వేట సాగిస్తున్నారు.

సాంకేతికత వినియోగం

ప్రస్తుతం పెద్ద బోట్లు, కొన్ని పడవల్లో జీపీఎస్, ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్ ఉపయోగించి మత్స్యకారులు చేపలవేట సాగిస్తున్నారు. ఇందులో భాగంగా బోటు కింద కెమెరాలు అమరుస్తున్నారు. బోటు లోపల కెమెరా అనుసంధానంతో చిన్న స్క్రీన్‌తో కూడిన కంప్యూటర్ లాంటి పరికరాలు పెడతారు. ఆ బోటు సముద్రంలో బాగా లోపలకు వెళ్లాక ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్‌ను ఆన్‌చేస్తారు. సముద్రం లోతు, చేపల చలనం ఫిష్ ఫైండర్ పరికరంలో కనిపిస్తుంది. చేపలు గుంపుగా వచ్చినప్పుడు అవి అనుకూలంగా తమకు దొరికేలా శబ్ద తరంగాలు విడుదల చేస్తాయి. వాటి వల్ల చేపలు రివర్స్‌లో వస్తాయి. ఆ చేపలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో చూసి వల విసురుతారు. దీంతో చేపల వలకు సులభంగా చిక్కుతాయి.

సాంకేతికత వైపు అడుగులు

ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్ ద్వారా చేపలు పట్టే విధానం సులభంగా ఉంటుంది. తమిళనాడు, గుజరాత్, ఏపీలో ఎక్కువ మంది దీన్ని ఉపయోగిస్తున్నారు. సాంకేతికత వైపు మత్స్యకారులు అడుగులు వేసే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. సాంకేతికతతో వేట సాగడంతో మత్స్యకారులు అభివృద్ధి చెందుతున్నారు.

చాందిని, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, విజయనగరం

నేడు రంగుల హోలీ

- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య పండగ



విక్రయానికి సిద్ధంగా ఉన్న రంగులు

విజయనగరం: ఫాల్గుణ మాస పౌర్ణమి. లేలేత చిగుళ్లు, విరబూసిన పూరెమ్మలు, చెట్లు వసంత రాగం ఆలపిస్తున్న తరుణంలో వయోబేధానికి అతీతంగా ఆనందోత్సాహలతో జరుపుకునే పండగ హోలీ. పురాణ ప్రాశస్త్యం కలిగిన ఈ పండగను అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు పులుముకుంటూ ఆనంద సాగరంలో మునిగితేలుతారు. దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకునే పండగను విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాలకు చెందిన ప్రజలు ఇష్టంగా జరుపుకోవడం కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది.

ఆనందంతో పాటు ఆరోగ్యం..

ఒకప్పుడు పూలు, పండ్ల ద్వారా వచ్చిన రంగులనే హోలీ వేడుకల్లో వాడేవారు. పండగకు ఒక రోజు ముందు అడవికి వెళ్లి మోదుగపూలు సేకరించేవారు. వాటిని ఉడికించగా వచ్చే ఎర్రని ద్రావణంలో పసుపు, కుంకుమ కలిపి ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సంబరాలు చేసుకునేవారు. కాలక్రమేణా వార్నిష్, సింథటిక్ రంగులను చల్లుకుంటున్నారు. అయితే హోలీ ఆడడంలో జాగ్రత్తలు తీసుకోక తప్పదని చర్మవ్యాధుల నిపుణులు హెచ్చరిస్తున్నారు. రసాయనాలతో మిళితమైన రంగులు కాకుండా సహజసిద్ధమైన రంగులతో హోలీ జరుపుకోవడం ద్వారా చర్మానికి హాని జరగకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.



హోలీ పండగ జరుపుకుంటున్న దృశ్యం (ఫైల్)

ఈ సూచనలు పాటిస్తే మేలు....

- రసాయన రంగులైన లెడ్ ఆక్సైడ్, అల్యూమినియం, బ్రోమెడ్, మెర్క్యురీ సల్ఫేట్ వంటివి వినియోగిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. అవి కళ్లల్లో పడితే కంటిచూపు పోయే ప్రమాదం ఉంది.
- గులాల్ వంటివి వినియోగిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. ఈ రంగులతో ఆస్తమా, చర్మ సంబంధిత వ్యాధులు ఉత్పన్నమవుతాయి.
- రసాయనాలు కలిసిన రంగులతో హోలీ ఆడితే వాటిని శరీరంపై ఎక్కువ సమయం ఉండనీయకూడదు. వెంటనే చల్లని నీటితో శరీరాన్ని శుభ్రం చేసుకోవాలి.
- ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకునేందుకు సబ్బుకన్నా క్లెన్సింగ్ మిల్క్ ఉత్తమమైనది.
- చాలా మంది రంగుల్లో వివిధ రకాల ఆయిల్స్ కలుపుతారు. ఆ కారణంగా రంగులను శుభ్రం చేసుకునేందుకు నీరు ఎక్కువగా అవసరమవుతుంది. అందుకే రంగుల్లో ఎటువంటి ఆయిల్స్ లేదా నీటిని కలపకుండా హోలీ ఆడడం ద్వారా నీటి వృథాను అరికట్టవచ్చు.

సంప్రదాయ రంగులే ఉత్తమం:

దేశ వ్యాప్తంగా జరుపుకునే హోలీ పండగను సంప్రదాయ రంగులతో చేసుకోవడం ఉత్తమం. ముఖ్యంగా చిన్న పిల్లలను రంగుల పండగకు దూరంగా ఉంచాలి. చాలా మంది రసాయనాలతో తయారు చేసే రంగులను వాడుతుంటారు. వాటి కారణంగా చర్మవాధులు, కంటి సంబంధిత ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. జాగ్రత్తగా పండగను జరుపుకుంటే అందరూ సంతోషంగా ఉంటారు.

– శ్రీనివాసరావు, చిన్న పిల్లల వైద్యనిపుణుడు

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి





సంఘటనా స్థలంలో మృతదేహం (ఇన్‌సెట్లో) భాస్కరరరావు(ఫైల్)

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ సమీపంలో శనివారం అర్ధరాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో సంతకవిటి మండలంలోని అక్కరాపల్లి గ్రామానికి చెందిన నారాయణశెట్టి భాస్కరరావు(35) అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. భాస్కరరావు, పెదనాన్న కుమారుడు పార్వతీశం బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. దీంతో జరిగిన ప్రమాదంలో భాస్కరరరావు మృతిచెందగా బైక్‌పై వెనుక కూర్చున్న పార్వతీశానికి తీవ్ర గాయాలయ్యాయి. ఎదురుగా వచ్చి ఢీకొన్న మరో వాహనచోదకుడు రేగిడి మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన శ్రీను కూడా గాయాలపాలయ్యాడు. ప్రమాదం జరిగిన సమీపంలోని కొంతమంది వ్యక్తులు 108 వాహనానికి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించారు. పట్టణ ఎస్సై రవికిరణ్ సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించి కేసు నమోదుచేశారు. మృతుడు భాస్కరరావుకు భార్య నాగమణితో పాటు కుమారుడు ఉన్నాడు.

బైక్ ఢీకొని వ్యక్తి..



బొండపల్లి: మృతి చెందిన గౌరినాయుడు

బొండపల్లి: మండలంలోని జీపీ అగ్రహారం గ్రామానికి చెందిన వ్యక్తి బహిర్భుమికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సమ్మి గౌరినాయుడు(50) ఆదివారం వేకువ జామున బహిర్భూమికి వెళ్తుండగా ఇదే మండలంలోని రెల్లిపేటకు చెందిన వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తూ వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో జరిగిన ప్రమాదంలో తల వెనుక గాయం కాగా గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడితో ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108కు సమాచారం ఇవ్వగా వాహనం రాకముందే మృతిచెందాడు. మృతుని భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నాగావళి కాలువలో పడి వ్యక్తి..



జియ్యమ్మవలస: గోపాల్ శ్రీనివాసరావు మృతదేహం

జియ్యమ్మవలస: మండలంలోని తురకనాయుడువలస గ్రామానికి చెందిన పుచ్చ గోపాల్ శ్రీనివాస రావు (44) ప్రమాదవశాత్తు తోటపల్లి ఎడమకాలువలో జారిపడి మృతిచెందాడు. ఈ మేరకు ఎస్సై అనీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపాల్ శ్రీనివాస రావు శనివారం పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతుకుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇటిక గదబవలస వద్ద ఆదివారం ఉదయం ఓ మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీసి తురకనాయుడువలస గ్రామానికి చెందిన గోపాల్ శ్రీనివాసరావుగా గుర్తించారు. ఈ మేరకు బంధువులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి వచ్చి భోరున విలపించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనీష్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా ఒకరికి పెళ్లైంది.